క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెరవలి: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మండలంలోని తీపర్రు, అజ్జరం, వెంకటరాయపురం, కాకరపర్రు గ్రామాలకు కరెంట్ సరఫరా నిలిపి వేస్తామని ట్రాన్స్‌కో అధికారి బి.వీరభద్రరావు సోమవారం తెలిపారు. అలాగే మల్లేశ్వరం ఫీడర్‌పై కొత్తగా విద్యుత్ లైన్ ఏర్పాటు నిమిత్తం మల్లేశ్వరం, కడింపాడు గ్రామాలకు ఈనెల 16,17,18 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సరఫరాను నిలిపివేస్తామని ప్రకటించారు.

విద్యార్థుల ఆరోగ్యం జాగ్రత్త

గోపాలపురం: పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో కె.రమేష్‌బాబు సూచించారు. మండలంలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలతో సోమవారం స్థానిక మండల పరిషత్ ఆఫీసు వద్ద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో రమేష్‌బాబు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున విద్యార్థుల ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వారికి డయేరియా, ఇతర సీజనల్ వ్యాధులు సోకకుండా పాఠశాలల్లో జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. మల,మూత్ర విసర్జన తర్వాత ప్రతి విద్యార్థీ చేతులు శుభ్రం చేసుకునేలా చూడాలని ఉపాధ్యాయులను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు జి. శ్రీనివాసరావు, ఎ. మహేశ్వరరావు, హెచ్‌ఎంలు డి. సుబ్రహ్మణ్యం, లక్ష్మీ ప్రసాద్, నారాయణరావు, శేషారత్నం, సంపూర్ణ స్వరాజ్యం, సీఆర్పీ కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం

నిడదవోలు: రోటరీ క్లబ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు, వారి సహాయకులకు అన్న సమారాధన చేశారు. కారింకి పల్లారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఆర్థిక సహకారంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొర్లేపర వెంకట రత్నకుమార్, కార్యదర్శి అనంతపల్లి కృష్ణచైతన్య, మీసాల ప్రసాద్, కేదారిశెట్టి రవికుమార్, చిక్కాల రాజ, సానేపు వెంకట సుబ్బారావు, రోటరీ సభ్యులు, సత్య సాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

14 రోజుల్లో 28 కేబుల్ వైర్ల చోరీ

నల్లజర్ల: మండలంలోని ముసుళ్లగుంట, శింగరాజుపాలెం గ్రామాల పొలాల్లో గత 14 రోజుల్లో 28 వ్యవసాయ మోటార్ల వద్ద గల కేబుల్ వైర్లను దుండగులు పట్టుకుపోయిరు. మరికొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి అందులోని రాగివైర్లను పట్టుకుపోతున్నారని రైతులు తెలిపారు. దీనిపై రైతులు సోమవారం నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.మోటార్ల కేబుల్ వైర్ కత్తిరించుకుపోతే వారికి వచ్చేది స్వల్పమే అయినా తాము మాత్రం తిరిగి కేబుల్ అమర్చాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు వెల్లి నారాయణరావు, నందమూరి రామకృష్ణ, విల్లి సత్యనారాయణ, సుబ్బారావు వాపోయారు. అనంతపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్లనే టార్గెట్ చేస్తున్నారని ట్రాన్స్‌కో ఏఈ బాపిరాజు తెలిపారు.

బాలికను వేధించిన ఇద్దరి అరెస్టు

తాళ్లపూడి: పాఠశాల విద్యార్థినిని వేధించడమే గాకుండా, మందలించిన ఆమె మేనమామపై దాడికి పాల్పడిన వేగేశ్వరపురానికి చెందిన ఉన్నమాటి అనిల్‌కుమార్‌ను, అతడికి సహకరించిన మరొకరిని తాళ్లపూడి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వేగేశ్వరపురం హైస్కూల్లో టెన్త్ చదువుతున్న విద్యార్థినిని అనిల్‌కుమార్ వెంటపడి వేధించేవాడు. దాంతో అతడిని రావూరుపాడుకు చెందిన ఆ విద్యార్థి మేనత్త, మేనమామలు కొలిశెట్టి దుర్గా వెంకటలక్ష్మి, మేనమామ సతీష్‌లు కొద్ది రోజుల క్రితం పిలిపించి గట్టిగా మందలించారు. దాంతో ఆగ్రహం చెందిన అనిల్‌కుమార్ ఈ నెల 2న మరో నలుగురితో బాలిక ఇంటికి వెళ్లి సతీష్‌ను రక్తం వచ్చేలా కొట్టారు. దీనిపై కొలిశెట్టి దుర్గా వెంకటలక్ష్మి, సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదు సెక్షన్లతో పాటు పోక్సో చట్టం కింద నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్సై శ్యామ్‌సుందర్ తెలిపారు. నిందితుల్లో ఉన్నమాటి అనిల్ కుమార్, ఉన్నమాటి సాయికుమార్‌లను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై వివరించారు.

వచ్చే ఏడాది దేవరపల్లిలో సాధు పరిషత్ మహాసభలు

దేవరపల్లి: 2025 జనవరి 18,19,20,21 తేదీల్లో దేవరపల్లిలోని కరుటూరి ఫంక్షన్ హాల్లో అఖిలాంధ్ర సాదు పరిషత్ 60వ మహాసభలు నిర్వహిస్తున్నట్టు పరిషత్ అధ్యక్షుడు మాత పరవిద్య నందగిరి స్వామీజీ, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర నందగిరి స్వామీజీలు తెలిపారు. సోమవారం కరుటూరి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో స్వామీజీలు మాట్లాడారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే మహాసభలకు దేశ నలుమూలల నుంచి సుమారు 300 మంది సాధువులు, పలువురు పీఠాధిపతులు, సన్యాసులు హాజరవుతారని తెలిపారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

నిడదవోలు: పారిశుధ్య కార్మికుల కోసం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రెండు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. సరిపల్లి రమణ అనే దాత ఏర్పాటు చేసిన ఈ సిమెంట్ బెంచీలను సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

హామీ వెంటనే అమలు చేయాలి



నేను డిగ్రీ చదువుకున్నాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇప్పుడు వాటి గురించి ఎవరూ మాట్లాడడం లేదు. ఖాళీగా ఉన్న ప్రభుత్వోద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగం వచ్చే వరకూ నిరుద్యోగ భృతి చెల్లించాలి.

– పి. లక్ష్మణరావు, బ్రాహ్మణగూడెం, చాగల్లు మండలం

ఏదీ నిరుద్యోగ భృతి?



బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేసి ఐదేళ్లు కావొస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం అన్నారు. ఉద్యోగం వచ్చే వరకూ నిరుద్యోగ భృతి అన్నారు. ప్రభుత్వం రెండింటిపైనా నోరు మెదపడం లేదు. చిన్నచిన్న పనులు చేసుకుంటున్న నాలాంటి యువకులు ప్రభుత్వం ఇచ్చే భృతితో ఎలాగోలా నెట్టుకు రావచ్చనే ఉద్దేశంతో పోటీ పరీక్షల్లో రాణించేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నాం. నిరుద్యోగ భృతి హామీతో తిరిగి పోటీ పరీక్షల వైపు మొగ్గు చూపుతున్నాం. ఉద్యోగమా, నిరుద్యోగ భృతా ఏదో ఒకటి ప్రభుత్వం త్వరగా తేల్చి చెప్పాలి.

– నీరుకొండ కోటేశ్వరరావు, నల్లజర్ల

మోసగించారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటికో ఉద్యోగం ఇస్తామని, లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని 2014 ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారం చేపట్టారు. నమ్మి ఓటేసిన యువతను మోసగించారు. మళ్లీ ఇప్పుడు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. నాకైతే నమ్మకం లేదు. ప్రతిసారీ చంద్రబాబుతో పాటు కూటమి నాయకులు నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారు. జాబ్ క్యాలెండర్‌తో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలి.

– సిర్రా బుల్లియ్య, సమిశ్రగూడెం, నిడదవోలు మండలం

చంద్రబాబుపై నమ్మకం లేదు



ఎన్నికల వేళ చంద్రబాబు చెప్పిన ఇంటికో ఉద్యోగం, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతిపై నమ్మకం లేదు. నేను బీటెక్ చేసి ఏడేళ్లు అయ్యింది. 2017లో నిరుద్యోగ భృతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాను. మంజూరు కాలేదు. కొందరు నా మిత్రులకు మూడు నెలల నిరుద్యోగ భృతిగా రూ.2 వేల చొప్పున ఇచ్చారు. తర్వాత ఆ భృతీ అందలేదు. ఇప్పుడూ అలాగే జరుగుతుంది. ఇచ్చినా రెండు, మూడు నెలలిచ్చి చేతులెత్తేస్తారు. నిరుద్యోగ భృతి కంటే జాబ్ క్యాలెండర్ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తే నిరుద్యోగులకు ఉపాధి కలుగుతుంది.

– చిటికిన వెంకటరత్నం, త్యాజంపూడి, దేవరపల్లి మండలం

వెంటనే చెల్లించాలి



కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు భృతి చెల్లిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ప్రకటించారు. ఇంటికో ఉద్యోగం అన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. గతంలోను జాబు రావాలంటే బాబు రావాలన్నారు. కాని అమలు చేయలేదు.

– శీర్ల ప్రసాద్, నిరుద్యోగి, వేగేశ్వరపురం, తాళ్లపూడి మండలం

నిరుద్యోగ భృతి .. భ్రమేనా?

- ఉద్యోగం వచ్చేంత వరకూ నెలకు రూ.3 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- నెల రోజులైనా హామీపై నోరు విప్పని సర్కార్
- భృతి ఎప్పుడిస్తారో ప్రకటించాలని నిరుద్యోగుల డిమాండ్
- డివిజన్‌లో రెండు లక్షల కుటుంబాలు ఎదురు చూపులు

కొవ్వూరు: నిరుద్యోగ యువత ఆశలు ఈ సారైనా ఫలిస్తాయో లేదో అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటికో ఉద్యోగం, లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. అప్పట్లో నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తా మని చెప్పి మోసగించారు. ఈ సారి సూపర్ సిక్స్ పేరుతో నిరుద్యోగ యువతకు ఉద్యో గం వచ్చేంత వరకూ నెలకు రూ.3వేల చొప్పున భృతి అందిస్తామని ఊరూ వాడా ప్రచారం గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చి నెల రోజులు కావస్తున్నా ఆ హామీ ఊసే ఎత్తడం లేదు. కనీసం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఈ హామీని ఎప్పటి నుంచి అమలు చేస్తారో వెల్లడించడం లేదు. కూటమి పార్టీలు సైతం ఈ అంశంపై నోరు విప్పకపోవడంతో నిరుద్యోగులంతా నిరాశతో ఉన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నిరుద్యోగ యువతకు రూ.3 వేల చొప్పున ప్రతి నెలా భృతి ఇస్తామన్న చంద్రబాబు నాయుడి హామీపై నేటికీ కార్యాచరణ ప్రకటించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొవ్వూరు డివిజన్‌లో ఇలా..

కొవ్వూరు డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో 2011 లెక్కల ప్రకారం 1,97,706 కుటుంబాలు ఉన్నాయి. పట్టణ ప్రాంతంలో 22,724 , గ్రామీణ ప్రాంతంలో 1,74,982 కుటుంబాలు ఉన్నాయి. ఇప్పుడు ఆ సంఖ్య రెండు లక్షల పైబడి ఉంటుంది. కొవ్వూరు డివిజన్‌లో 7,07,888 మంది జనాభా ఉండగా, వారిలో 4,61,917 మంది అక్షరాస్యులు. వీరిలో వయసు పైబడిన వారు, అర్హతలు లేని వాళ్లను మినహాయిస్తే సుమారు రెండు లక్షల మంది నిరుద్యోగులుంటారని అంచనా. నెలకు రూ.3 వేల చొప్పున లెక్కిస్తే డివిజన్‌లోని నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.60 కోట్లు చెల్లించాలి. ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రకటించిన ఉమ్మడి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్‌లో నిరుద్యోగుల ఉపాధికి పెద్దపీట వేస్తామన్నారు. 20 లక్షల ఉద్యోగ కల్పనతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకూ రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని యువతను నమ్మించారు. కొలువుల కోసం నిరుద్యోగ యువత నిరంతరం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పరంగా ఏ నోటిఫికేషన్ వెలువడినా దరఖాస్తు చేస్తూ, ఇంటర్వ్యూలకు పరుగులు తీస్తున్నారు. కనీసం ప్రభుత్వం ప్రకటించిన రూ.3 వేల భృతి అయినా ప్రతి నెలా తమకు చేతికి అందితే కనీస ఆర్థిక తోడ్పాటు ఉంటుందని నిరుద్యోగులు పేర్కొంటున్నారు. ఒక వైపు ప్రభుత్వ కొలువులకు నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడంతో వయో పరిమితి దాటిపోయి ఉద్యోగాలకు దూరం అవుతామనే భయం కూడా నిరుద్యోగులను వెంటాడుతోంది.

మండలం	కుటుంబాల సంఖ్య
తాళ్లపూడి	15,109
దేవరపల్లి	21,841
కొవ్వూరు	19,266
చాగల్లు	18,585
నిడదవోలు	19,826
గోపాలపురం	17,624
ఉండ్రాజవరం	20,597
పెరవలి	19,192
నల్లజర్ల	22,292
మొత్తం	1,74,982
కొవ్వూరు (మునిసిపాలిటీ)	10,919
నిడదవోలు (మునిసిపాలిటీ)	11,805
మొత్తం	1,97,706

నిరుద్యోగులను దగా చేస్తున్న ప్రభుత్వం



ప్రతి ఇంటికో ఉద్యోగమని, ప్రతి నిరుద్యోగికీ రూ.2 వేల భృతి చెల్లిస్తామని 2014 ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చి మోసం చేశారు. ఈ సారి సూపర్ సిక్స్ పేరుతో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ప్రతి నిరుద్యోగికీ రూ.3 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. అధికారం చేపట్టి నెల కావస్తున్నా ఇంత వరకూ నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం నోరు మెదపడం లేదు. గతంలో చంద్రబాబు పాలనలో కేవలం 34 వేల మందికే ఉద్యోగాలిచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాక వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చేంత వరకూ 2 లక్షల ఉద్యోగాలే ఇచ్చారు. ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే 2.38 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు, మరో 4 లక్షల మందికి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించారు. చంద్రబాబు నిరుద్యోగులను దగా చేస్తున్నారు.

– తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే

అమలు సాధ్యం కాదు



ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీ అమలు సాధ్యం కాదు. 2014లో ఇంత కంటే తక్కువ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అమలు చేయలేక ప్రజలను మోసగించింది. అప్పుడు కూడా నిరుద్యోగ భృతి రూ. 2 వేలు ఇస్తానని చెప్పి కొంతకాలం ఇచ్చి ఎగనామం పెట్టారు. ఇప్పుడు కూడా అదే జరుగుతుంది. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో నిరుద్యోగులకు చెప్పాలి.

– తానేటి వనిత, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, గోపాలపురం

హామీ అమలు చేయాలి



నిరుద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని చంద్రబాబునాయుడి ప్రభుత్వం అమలు చేయాలి. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి. ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేయాలి.

– కోడి మోహన్‌నాయుడు, పెద్దేవం, తాళ్లపూడి మండలం

నిరుద్యోగుల ఊసే ఎత్తడం లేదు



కూటమి పార్టీలు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలవారీ నిరుద్యోగ భృతి చెల్లించాలి. ప్రభుత్వం ఏర్పడి నెల గడుస్తున్నా నిరుద్యోగుల ఊసే ఎత్తడం లేదు. గతంలో మాదిరి నిరుద్యోగులను మోసగించకుండా ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి. ఉద్యోగాలు కల్పించే వరకూ ఆర్థిక సాయంగా భృతి ఇస్తే నిరుద్యోగులకు, వారి కుటుంబాలకు కొంత మేలు జరుగుతుంది.

– కొయ్యే సురేష్, నిరుద్యోగి, నిడదవోలు టౌన్

ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలి



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. ప్రధానంగా ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి హామీపై స్పష్టత ఇవ్వాలి. నిరుద్యోగులంతా హామీ అమలు కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. నెలకు రూ.3 వేల భృతి ఇస్తే నిరుద్యోగులకు కొంత ఊరట లభిస్తుంది. భృతి ఎప్పటి నుంచి ఇస్తారో ప్రభుత్వం ప్రకటించాలి. నేను డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు అయింది.

– ఎస్‌కే నజీర్, కరిచర్లగూడెం, నిరుద్యోగి, గోపాలపురం మండలం

విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి

- ఎంపీపీ దుర్గారావు
- విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, షూస్ పంపిణీ



దేవరపల్లి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థినికి యూనిఫాం అందజేస్తున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి: విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసి విద్యార్థులను ప్రోత్సహించాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం ఆయన యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, షూస్ అందజేశారు. దేవరపల్లి సర్పంచ్ కడిమి వీర కుమారి అధ్యక్షతన ఈ సందర్భంగా హైస్కూల్లో నిర్వహించిన సమావేశంలో దుర్గారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలన్నారు. తల్లికి వందనం హామీని తూచా తప్పకుండా అమలు చేసి పేద విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. పాఠశాలకు అవసరమైన సౌకర్యాల విషయమై ఉపాధ్యాయులు తన దృష్టికి తీసుకు వస్తే తన వంతు తోడ్పాటు అందజేస్తానన్నారు. పాఠశాలలోని సుమారు 500 మంది విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, షూస్ అందజేశారు. అనంతరం పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంపీపీ పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఎంఈఓలు ఎం.తిరుమలదాస్, కేఎస్‌ఆర్‌వీవీ అప్పారావు, హెచ్‌ఎం కె.శ్రీలక్ష్మి, టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు కంబాల సత్తిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

52 గ్రాముల బంగారు ఆభరణాల చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పగలగొట్టిన బీరువా, చిందర వందరగా ఉన్న వస్తువులు

పెరవలి: తాళం వేసి ఉన్న ఇంట్లోకి దుండగులు ప్రవేశించి బీరువా పగులగొట్టి, అందులో భద్రపరిచిన 52 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. మండలంలోని ముక్కామల పంచాయతీ పరిధిలోని ముత్యాలవారిపాలెంలో శనివారం రాత్రి ఈ చోరీ జరిగింది. పెరవలి ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముత్యాలవారిపాలేనికి చెందిన మార్నెళ్ల వెంకటేశ్వరరావు శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి, కుమారుడిని చూడడానికి భార్యతో కలసి ఉండ్రాజవరం వెళ్లారు. ఆ దంపతులు ఆదివారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళంతో పాటు ఇంట్లోని బీరువా కూడా పగలగొట్టి ఉంది. అందులో భద్రపరిచిన రూ.3.5 లక్షల విలువైన 52 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఈ చోరీపై వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని విచారణ కొనసాగిస్తున్నామని పెరవలి ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.

మీ కోసంలో 11 అర్జీలు

కొవ్వూరు: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 11 వినతులు అందాయి. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కార మార్గాలు చూపించారు. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామంలో 300 ఎకరాల్లోని పంటలు వరదలో మునిగిపోతున్నాయని కాలువలు పూడిక తీత, ఆక్రమణ తొలగింపునకు చర్యలు తీసుకోవాలంటూ పాలకుర్తి మోహన్ సత్యవంశీతో పాటు పలువురు రైతులు కోరారు. తాను ఇరిగేషన్, ఏపీఎస్ ఐడీసీ, ఇంజినీరింగ్ అధికారులతో కలసి స్వయంగా ముంపు ప్రాంతాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తానని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. దొమ్మేరులోని తన పొలంలో పంచాయ వ్యర్థాలను డంప్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ముదునూరి పద్మకుమారి అనే రైతు కోరారు. తన ఇంటిని ఆక్రమించుకున్న వారిని ఖాళీ చేయించి చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన ఎస్ఎస్ మార్టిన్ అర్జీ సమర్పించారు. డీఎల్‌డీవో శాంతామణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్వాక్రా సీసీపై వచ్చిన అభియోగాలపై విచారణ



విచారణాధికారికి ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా సీఏలు

పెరవలి: డ్వాక్రా సీసీ రమేష్‌పై వచ్చిన అవినీతి అభియోగాలపై స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం ముగ్గురు అధికారులు విచారణ జరిపారు. అవినీతి, దురుసు ప్రవర్తన, మహిళలతో అసభ్యంగా మాట్లాడుతున్నారంటూ డ్వాక్రా సీసీ రమేష్‌పై పలువురు డ్వాక్రా సీఏలు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయనను ఇక్కడి నుంచి బదిలీ చేయాలని కోరారు. దీనిపై జెండర్ ఏపీఎం నాగలక్ష్మి, ఏరియా కో–ఆర్డినేటర్ రాజాబాబు, 'ఉన్నతి' ఏపీఎం త్రిమూర్తులు మంగళవారం ఇక్కడ విచారణ జరిపారు. డ్వాక్రా స్త్రీనిధి రుణాలు మంజూరు చేయాలంటే ప్రతి లబ్ధిదారు రూ.500 ఇవ్వాలని, లేకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తానని బెదిరిస్తున్నారని, మామూళ్లు ఇవ్వని గ్రూపులకు రుణాలు మంజూరు చేయడం లేదంటూ రమేష్‌పై ఖండవల్లికి చెందిన డ్వాక్రా సీఏలు విచారణాధికారుల దృష్టికి తెచ్చారు. అంతేగాకుండా మహిళలమైన తమను రమేష్ తీవ్ర దుర్భాషలు ఆడుతున్నారని డ్వాక్రా సీఏలు వివరించారు. సీఏలతో విడివిడిగా మాట్లాడి, వచ్చిన ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరుపుతామని విచారణాధికారులు తెలిపారు. డ్వాక్రా సీఏలు ఇచ్చిన లిఖిత పూర్వక ఫిర్యాదును పరిశీలించి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని జెండర్ ఏపీఎం నాగలక్ష్మి తెలిపారు. విచారణలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఆగర్తి స్వరూపారాణి, ఏపీఎం నాగరాజు, పలువురు డ్వాక్రా సీఏలు పాల్గొన్నారు.

కొవ్వాడ కాలువ ముంపులో 1150 ఎకరాలు

దేవరపల్లి: భారీ వర్షాల ప్రభావంతో కొవ్వాడ కాలువ పంటలను ముంచెత్తింది. మూడు రోజులుగా వరి చేలు ముంపులో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గోపాలపురం మండలం చిట్యాల, వెంకటాయపాలెం గ్రామాలు, దేవరపల్లి మండలంలోని గౌరీపట్నంలో సుమారు 1,150 ఎకరాల్లోని వరి చేలు నీట మునిగినట్టు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. చిట్యాల, వెంకటాయపాలెం గ్రామాల్లో సుమారు 750 ఎకరాలు, గౌరీపట్నంలో 400 ఎకరాల్లోని వరి చేలు నీట మునిగినట్టు ఏవోలు బి.రాజారావు, కె.విజయ్ సోమవారం తెలిపారు. కొవ్వాడ కాలువ నీరు ముందుకు వెళ్లక వెనుకకు తన్నడం వల్ల కాలువకు ఇరువైపులా ఉన్న పంటలు ముంపునకు గురవుతున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సమస్య దీర్ఘకాలంగా రెండు మండలాల రైతులను పట్టి పీడిస్తోంది. ఇప్పటికైనా అధికారులు కాలువలోని పూడికతీసి ఆధునీకరణ చేసి పంటలను కాపాడాలని కోరుతున్నారు.

ముంపు సమస్య పరిష్కరిస్తా : ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి: శాశ్వత పరిష్కారం లేక కొవ్వాడ కాలువ నీటితో పంటలు నీట మునుగుతున్నాయని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తిరుగుడుమెట్ట,పెద్దేవం గ్రామాల రైతుల అభ్యర్థన మేరకు కొవ్వాడ కాలువను, నీటి మునిగిన పంటలను ఎమ్మెల్యే ముప్పిడి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు రైతులను ఏ విధంగా ఆదుకోవాలనే విషయపై రెవెన్యూ, వ్యవసాయ, ఇరిగేషన్, శాఖల అధికారులతో ఆయన చర్చించారు. గుర్రప్పు డెక్క, పూడిక, ఆక్రమణల తొలగింపు చేయిస్తానన్నారు.

వరి పంట ముంపుపై కలెక్టర్‌కు నివేదిస్తా

- జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు
- నీట మునిగిన పంట పరిశీలన



గోపాలపురం మండలం చిట్యాలలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

గోపాలపురం: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన వరి పంటను సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు పరిశీలించారు. మండలంలోని వెంకటాయపాలెం, చిట్యాల, చెరుకుమిల్లి గ్రామాల్లో దెబ్బ తిన్న వరి పంటను ఆయన పరిశీలించారు. ముంపు రైతులతో మాట్లాడారు. ముంపునకు గురైన పంటల వివరాలను నమోదు చేసి ఆ వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ముంపు నీరు బయటకు వెళ్లేలా రైతులు పొలాల్లో స్వచ్ఛందంగా శ్రమదానం చేయాలని సూచించారు. ముంపు తర్వాత పంటలను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన రైతులకు వివరించారు. ఆయన వెంట కొవ్వూరు ఏడీఏ పి. చంద్రశేఖర్, ఏవో బి.రాజారావు, మూడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నల్లజర్ల మండలంలో..

నల్లజర్ల: వర్షాలకు వివిధ దశల్లో ఉన్న నారుమడులు, వరి చేలు ముంపునకు గురయ్యాయని ఏవో కె.కమల్‌రాజ్ తెలిపారు. విత్తనం చల్లి రెండు, మూడు రోజులై మూడు రోజుల కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఈదశలో వీలైనంత తొందరగా నీటిని పూర్తిగా బయటకు తీసి వేయడంవల్ల గాలిపోసుకొని విత్తనానికి నష్టం వాటిల్లదన్నారు. అలా నీరు తీయడానికి వీలు లేకపోతే మొలక శాతం దెబ్బ తింటుందని, మళ్లీ విత్తనం వేసుకోవాల్సి ఉంటుందన్నారు. కాగా మండలంలో దాదాపు 250 ఎకరాలలో నాట్లు నీట మునిగినట్టు చెప్పారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: వర్షాలకు వివిధ దశల్లో ఉన్న వరి పంట కొన్ని ప్రాంతాల్లో ముంపునకు గురైందని ఏవో కె.వేణుగోపాల్ తెలిపారు. నష్ట నివారణకు నీటిని తీసి వేసిన తర్వాత, 5 సెంట్ల నారు మడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకుంటే కొత్త ఆకు వచ్చి ఊడ్పులకు అందుతుందన్నారు. నీరు పూర్తిగా తీసివేసి మొక్క నిలదొక్కుకున్నాక నారు మడికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బండైజం లేదా రెండు గ్రాముల కార్బండైజం + మాంకోజెబ్ కలిపిన మిశ్రమ మందును పిచికారీ చేయాలన్నారు. తెగుళ్లు రాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు.